"మధురమైన పిల్లలూ - ప్రభాత సమయంలో మనస్సు-బుద్ధి ద్వారా తండ్రినైన నన్ను గుర్తుచేయండి, దానితో పాటుగా భారత్ ను దైవీ రాజ్య స్థానముగా తయారుచేసే సేవను చేయండి"

ప్రశ్న:- సూర్యవంశీ రాజధాని యొక్క బహుమతి దేని ఆధారముగా లభిస్తుంది?

జవాబు:- సూర్యవంశీ రాజధాని యొక్క బహుమతిని తీసుకోవాలంటే తండ్రికి పూర్తి సహాయకులుగా అవ్వండి, శ్రీమతంపై నడుస్తూ ఉండండి. ఆశీర్వాదాన్ని అడగకూడదు, కానీ యోగబలముతో ఆత్మను పావనంగా తయారుచేసే పురుషార్థము చేయాలి. దేహ సహితంగా దేహపు సర్వ సంబంధాలనూ త్యజించి ఒక్క అతి ప్రియమైన తండ్రిని స్మృతి చేసినట్లయితే మీకు సూర్యవంశీ రాజధాని యొక్క బహుమతి లభిస్తుంది. అందులో శాంతి, పవిత్రత, సమృద్ధి అన్నీ ఉంటాయి.

పాట:- చివరికి నేటికి ఆ రోజు వచ్చింది... (ఆఖిర్ వహ్ దిన్ ఆయా ఆజ్...)

ఓం శాంతి. ఓం శాంతి యొక్క అర్థమైతే పిల్లలైన మీ బుద్ధిలో సదా ఉంటుంది. తండ్రి ఏదైతే అర్థం చేయిస్తారో అది ఈ ప్రపంచంలో మీకు తప్ప ఇంకెవ్వరికీ అర్థం కాదు. ఏ విధంగానైతే మెడికల్ కాలేజీలోకి ఎవరైనా కొత్తవారు వెళ్ళి కూర్చుంటే ఏమీ అర్థం చేసుకోలేరో, అలాగే వారు కూడా ఏమీ అర్థం చేసుకోలేరు. మనుష్యులు వెళ్తారు కానీ వారికి ఏమీ అర్థం కాదు అనేటువంటి సత్సంగము ఇంకేదీ ఉండదు. అక్కడైతే శాస్త్రాలు మొదలైనవాటి విషయాలను వినిపిస్తారు. ఇది అత్యంత పెద్ద కాలేజీ. ఇది కొత్త విషయమేమీ కాదు. తండ్రి కూర్చొని పిల్లలకు రాజయోగాన్ని నేర్పించే ఆ రోజు మళ్ళీ నేడు వచ్చింది. ఈ సమయంలో భారత్ లో రాజ్యాలైతే లేవు. మీరు ఈ రాజయోగము ద్వారా రాజులకే రాజులుగా అవుతారు అనగా వికారీ రాజులు ఎవరైతే ఉంటారో వారికి కూడా మేము రాజులుగా అవుతున్నాము అని మీకు తెలుసు. బుద్ధి లభించింది. ఎవరు ఏ కర్మ చేసినా అది బుద్ధిలో ఉంటుంది కదా. మీరు యోధులు, ఆత్మలమైన మనము ఇప్పుడు తండ్రితో యోగాన్ని జోడించడం ద్వారా భారత్ ను పవిత్రంగా తయారుచేస్తామని మరియు చక్రము యొక్క ఆదిమధ్యాంతాల జ్ఞానాన్ని ధారణ చేసి మనము చక్రవర్తి రాజులుగా అవుతున్నామని మీకు తెలుసు. ఇది బుద్ధిలో ఉండాలి. మనం యుద్ధ మైదానంలో ఉన్నాము. విజయమైతే తప్పకుండా మనదే. ఇది నిశ్చితము. తప్పకుండా మనం ఇప్పుడు ఈ భారత్ ను మళ్ళీ దైవీ ద్వికిరీటధారీ రాజ్యస్థానముగా తయారుచేస్తున్నాము. బాబా చిత్రాల గురించి చాలా మంచి రీతిలో అర్థం చేయిస్తూ ఉంటారు. మనం 84 జన్మలను పూర్తి చేసి ఇప్పుడు తిరిగి వెళ్తాము, మళ్ళీ వచ్చి రాజ్యం చేస్తాము. ఈ బ్రహ్మాకుమార-కుమారీలందరూ ఏం చేస్తున్నారు, బ్రహ్మాకుమారీల యొక్క ఈ సంస్థ ఏమిటి? అని అడుగుతారు కదా. అప్పుడు బి.కె.లు వెంటనే - మేము శ్రీమతము ఆధారంగా ఈ భారత్ ను మళ్ళీ దైవీ రాజ్యస్థానముగా తయారుచేస్తున్నాము అని సమాధానమిస్తారు. మనుష్యులకు 'శ్రీ' అన్న మాటకు అర్థం కూడా తెలియదు. శ్రేష్ఠాతి-శ్రేష్ఠమైనవారు శివబాబా అని, వారి మాలయే తయారవుతుందని మీకు తెలుసు. ఈ రచన అంతా ఎవరిది? రచయిత అయితే తండ్రే కదా. సూర్యవంశీయులైనా-చంద్రవంశీయులైనా ఎవరైనా గాని, ఈ మాల అంతా రుద్రుడైన శివబాబాది. అందరికీ తమ రచయిత గురించి తెలుసు కానీ వారి కర్తవ్యము గురించి తెలియదు. వారు ఎప్పుడు వస్తారు మరియు ఎలా వచ్చి పాత ప్రపంచాన్ని కొత్తదిగా తయారుచేస్తారు - ఇది ఎవరి బుద్ధిలోనూ లేదు. కలియుగం ఇప్పుడింకా ఎన్నో సంవత్సరాలు కొనసాగనున్నదని వారు భావిస్తారు.

మనము దైవీ రాజ్యస్థానాన్ని స్థాపన చేయడానికి నిమిత్తంగా అయ్యామని ఇప్పుడు మీకు తెలుసు. తప్పకుండా దైవీ రాజ్యస్థానము ఉంటుంది, తర్వాత క్షత్రియ రాజ్యస్థానము ఉంటుంది. మొదట సూర్యవంశీ కులం ఉంటుంది, ఆ తర్వాత క్షత్రియ కులం యొక్క రాజ్యం ఉంటుంది. మీరు చక్రవర్తి రాజు-రాణులుగా అవ్వాలంటే బుద్ధిలో చక్రము తిరగాలి కదా. మీరు ఎవరికైనా ఈ చిత్రాలపై చాలా బాగా అర్థం చేయించవచ్చు. ఈ లక్ష్మీ-నారాయణులు సూర్యవంశీ కులము వారు, ఈ సీతా-రాములు క్షత్రియ కులము వారు. ఆ తర్వాత వైశ్య, శూద్ర వంశీయులుగా, పతిత కులము వారిగా అయిపోతారు. పూజ్యులు మళ్ళీ పూజారులుగా అవుతారు. సింగిల్ కిరీటము ఉన్న రాజుల చిత్రాన్ని కూడా తయారుచేయాలి. ఈ ఎగ్జిబిషన్ చాలా అద్భుతంగా తయారవుతుంది. డ్రామానుసారంగా సేవార్థము ఈ ఎగ్జిబిషన్ ఎంతో అవసరమని, అప్పుడే పిల్లల బుద్ధిలో కూర్చుంటుందని మీకు తెలుసు. కొత్త ప్రపంచ స్థాపన ఎలా జరుగుతుంది అనేది చిత్రాల ద్వారా అర్థం చేయించడం జరుగుతుంది. పిల్లల బుద్ధిలో సంతోషపు పాదరసము పైకెక్కాలి. సత్యయుగంలో

ఆత్మ జ్ఞానముంటుంది అనైతే అర్థం చేయించడం జరిగింది, అది కూడా ఎప్పుడైతే వృద్ధులుగా అవుతారో అప్పుడు అకస్మాత్తుగా ఆలోచన వస్తుంది - ఈ పాత శరీరాన్ని వదిలి మళ్ళీ కొత్త శరీరాన్ని తీసుకోవాలి అని. ఈ ఆలోచన చివరి సమయంలో వస్తుంది. మిగిలిన సమయమంతా సంతోషంలో, ఆనందంలో ఉంటారు. మొదటిలోనే ఈ జ్ఞానముండదు. పిల్లలకు అర్థం చేయించడం జరిగింది - ఎప్పటివరకైతే తండ్రి వచ్చి తమ పరిచయాన్ని ఇవ్వరో అప్పటివరకు ఈ పరమపిత పరమాత్మ యొక్క నామ, రూప, దేశ, కాలాల గురించి ఎవ్వరికీ తెలియదు, అంతేకాక వారి పరిచయం కూడా చాలా గంభీరముగా ఉంటుంది. వారి రూపము గురించి మొదట్లో లింగమనే చెప్పాల్సి ఉంటుంది. రుద్ర యజ్ఞాన్ని రచించినప్పుడు మట్టి లింగాలను తయారుచేస్తారు, వాటికి పూజలు జరుగుతూ వచ్చాయి. తండ్రి మొదటే - వారు ఒక బిందు రూపమని చెప్పలేదు. బిందు రూపమని చెప్పినట్లయితే మీరు అర్థం చేసుకోలేకపోయేవారు. ఏ విషయాన్ని ఎప్పుడు అర్థం చేయించాలో అప్పుడే అర్థం చేయిస్తారు. ఈ రోజు అర్థం చేయిస్తున్న విషయాలను మొదటే ఎందుకు అర్థం చేయించలేదు అని అనలేరు. అలా కాదు. ఎందుకంటే డ్రామాలో ఈ విధంగానే నిశ్చితమై ఉంది. ఈ ఎగ్జిబిషన్ ద్వారా సేవ వృద్ధి ఎంతగానో జరుగుతుంది. దేనినైనా కొత్తగా ఆవిష్కరిస్తే, అది ఇక వృద్ధి చెందుతూ ఉంటుంది. ఏ విధంగానైతే బాబా మోటారు కారు ఉదాహరణను ఇస్తారు. మొదట్లో దానిని ఆవిష్కరించడంలో ఎంతో శ్రమ కలిగి ఉంటుంది, కానీ ఆ తర్వాత చూడండి, పెద్ద-పెద్ద ఫ్యాక్టరీలలో ఒక్క క్షణంలో మోటారు కార్లు తయారైపోతాయి. సైన్స్ ఎంతగా వృద్ధి చెందింది.

ఇది ఎంత పెద్ద భారత్, ఎంత పెద్ద ప్రపంచం, కానీ తర్వాత ఎంత చిన్నదిగా అయిపోతుంది అనేది మీకు తెలుసు. ఈ విషయాలను బుద్ధిలో బాగా కూర్చోబెట్టుకోవాలి. ఎవరైతే సేవాధారీ పిల్లలు ఉంటారో, ఇవి వాళ్ళ బుద్ధిలోనే ఉంటాయి. మిగిలినవారికైతే తినడంలో-తాగడంలో, పరచింతనలోనే సమయము వృధా అవుతుంది. భారత్ లో మళ్ళీ దైవీ రాజ్యస్థానము స్థాపన అవుతోందని మీకు తెలుసు. వాస్తవానికి కింగ్డమ్ అన్న పదం కూడా తప్పే. భారత్ దైవీ రాజ్యస్థానముగా తయారవుతుంది. ఈ సమయంలో అసురీ రాజ్యస్థానముగా ఉంది, రావణ రాజ్యముంది. ప్రతి ఒక్కరిలో పంచ వికారాలు ప్రవేశించి ఉన్నాయి. ఎన్ని కోట్లాది మంది ఆత్మలు ఉన్నారు, అందరూ పాత్రధారులే. తమ-తమ సమయానికి వస్తారు మరియు వెళ్ళిపోతారు. మళ్ళీ ప్రతి ఒక్కరూ తమ పాత్రను రిపీట్ చేయవలసి ఉంటుంది. క్షణ-క్షణమూ డ్రామా అదే విధంగా రిపీట్ అవుతుంది. కల్పక్రితం ఏ పాత్రనైతే అభినయించారో, అదే ఇప్పుడు అభినయించబడుతుంది, ఇదంతా బుద్ధిలో ఉంచుకోవాలి. వ్యాపార-వ్యవహారాల్లో ఉంటే ఇవి బుద్ధిలో ఉంచుకోవడం కష్టమవుతుంది, కానీ ప్రభాత సమయానికి ఎంతో మహిమ ఉందని తండ్రి అంటారు. ఓ నా మనసా, ప్రభాత వేళలో రాముడిని స్మరించు... అని పాడుతారు. తండ్రి అంటారు, ఇప్పుడిక వేరే ఏమీ స్మరించకండి, ప్రభాత సమయంలో నన్ను స్మృతి చేయండి. తండ్రి ఇప్పుడు సమ్ముఖంగా వినిపిస్తారు, భక్తి మార్గంలో మళ్ళీ గాయనము కొనసాగుతుంది. సత్య-త్రేతా యుగాలలో గాయనము జరగదు. తండ్రి అర్థం చేయిస్తారు - ఓ ఆత్మా, నీ మనస్సు-బుద్ధి ద్వారా ప్రభాత సమయంలో తండ్రినైన నన్ను స్మృతి చేయు. భక్తులు చాలావరకు రాత్రివేళలో మేల్కొంటారు, ఏదో ఒకటి తలచుకుంటూ ఉంటారు. ఇక్కడి ఆచార-వ్యవహారాలే మళ్ళీ భక్తి మార్గంలో కొనసాగుతూ వచ్చాయి. పిల్లలైన మీకు అర్థం చేయించేందుకు రకరకాల యుక్తులు లభిస్తూ ఉంటాయి. భారత్ ఇంత కాలం క్రితం దైవీ రాజ్యస్థానముగా ఉండేది, తర్వాత క్షత్రియ రాజ్యస్థానముగా అయ్యింది, ఆ తర్వాత వైశ్య రాజ్యస్థానముగా అయ్యింది. రోజు-రోజుకు తమోప్రధానంగా అవుతూ ఉంటారు, తప్పకుండా పడిపోవాల్సిందే. ముఖ్యమైనది ఈ చక్రము, చక్రాన్ని తెలుసుకోవడం ద్వారా మీరు చక్రవర్తీ రాజులుగా అవుతారు. ఇప్పుడు మీరు కలియుగంలో కూర్చున్నారు. ఎదురుగా సత్యయుగము ఉంది. ఈ చక్రము ఎలా తిరుగుతుంది అన్నదాని గురించి మీకు జ్ఞానం ఉంది. రేపు మనం సత్యయుగీ రాజధానిలో ఉంటామని మీకు తెలుసు. ఇది ఎంత సహజమైన విషయము. పైన త్రిమూర్తి శివుడు కూడా ఉన్నారు. చక్రము కూడా ఉంది. లక్ష్మీ-నారాయణులు కూడా ఇందులో వచ్చేస్తారు. ఈ చిత్రము ఎదురుగా పెట్టుకున్నట్లయితే ఎవరికైనా సహజ రీతిలో అర్థం చేయించవచ్చు. భారత్ దైవీ రాజ్యస్థానముగా ఉండేది, ఇప్పుడు అలా లేదు. సింగిల్ కిరీటధారులు కూడా లేరు. చిత్రాలపైనే పిల్లలైన మీరు అర్థం చేయించాలి. ఈ చిత్రాలు చాలా విలువైనవి. ఇవి ఎంతో అద్భుతమైనవి కావున వీటిపై అంతే అద్భుతమైన రీతిలో అర్థం చేయించాలి. ఈ వృక్షము మరియు త్రిమూర్తి చిత్రాలను కూడా అందరూ తమ-తమ ఇళ్ళల్లో పెట్టుకోవాల్సి ఉంటుంది. మిత్ర-సంబంధీకులు మొదలైనవారు ఎవరైనా వస్తే వారికి ఈ చిత్రాలపైనే అర్థం చేయించాలి. ఇది ప్రపంచ చరిత్ర మరియు భౌగోళికము. పిల్లలు ప్రతి ఒక్కరి వద్ద ఈ చిత్రాలు తప్పకుండా ఉండాలి. వాటితో పాటు మంచి-మంచి పాటలు కూడా ఉండాలి. చివరికి ఆ రోజు నేటికి వచ్చింది - తప్పకుండా బాబా వచ్చి ఉన్నారు. మనకు రాజయోగాన్ని నేర్పిస్తున్నారు. ఎవరు అడిగినా వారికి చిత్రాలు లభించగలవు. పేదవారికి ఉచితంగా లభించగలవు. కానీ అర్థం చేయించేందుకు కూడా శక్తి కావాలి. ఇది అవినాశీ జ్ఞాన రత్నాల ఖజానా. మీరు దాతలు, మీ

వలె ఈ అవినాశీ జ్ఞాన రత్నాల దానాన్ని ఇంకెవ్వరూ చేయలేరు. ఇటువంటి దానం ఇంకేదీ ఉండదు. కావున దానం చేయాలి, ఎవరు వస్తే వారికి అర్థం చేయించాలి. అలా ఒకరినొకరు చూసి ఎంతోమంది వస్తారు. ఈ చిత్రాలు ఎంతో విలువైనవి, అమూల్యమైనవి. అలాగే మీరు కూడా అమూల్యమైనవారిగా పిలవబడతారు. మీరు గవ్వ నుండి వజ్రతుల్యంగా అవుతారు. ఈ చిత్రాలను ఎవరైనా విదేశాలకు తీసుకువెళ్ళి అర్థం చేయించినట్లయితే అద్భుతము జరుగుతుంది. ఇన్నాళ్ళూ, ఈ సన్యాసులు - మేము భారత్ యొక్క యోగాన్ని నేర్పిస్తాము అని చెప్పుకుంటూ వచ్చారు. ప్రతి ఒక్కరూ తమ ధర్మం యొక్క మహిమను చేస్తారు. బౌద్ధ ధర్మం వారు ఎంత మందిని బౌద్ధులుగా తయారుచేస్తారు, కానీ దాని వలన లాభమైతే ఏమీ లేదు. మీరైతే ఇక్కడ మనుష్యులను కోతుల నుండి మందిరయోగ్యులుగా తయారుచేస్తారు. భారత్ లోనే సంపూర్ణ నిర్వికారులు ఉండేవారు. భారత్ తెల్లగా ఉండేది, ఇప్పుడు భారత్ నల్లగా ఉంది. ఎంతమంది మనుష్యులున్నారు! సత్యయుగంలో చాలా కొద్దిమందే ఉంటారు కదా. సంగమములోనే తండ్రి వచ్చి స్థాపన చేస్తారు. రాజయోగాన్ని నేర్పిస్తారు. ఏ పిల్లలైతే కల్పక్రితము కూడా నేర్చుకున్నారో, ఆ పిల్లలకే నేర్పిస్తారు. స్థాపన అయితే జరగాల్సిందే. పిల్లలు రావణుడితో ఓడిపోతారు, మళ్ళీ రావణుడిపై విజయం పొందుతారు. ఇది ఎంత సహజము. కావున పిల్లలు పెద్ద చిత్రాలను తయారుచేసి వాటిపై సేవ చేయాలి. పెద్ద-పెద్ద అక్షరాలు ఉండాలి. ఇక్కడి నుండి భక్తి మార్గం ప్రారంభమవుతుంది అని వ్రాయాలి. తప్పకుండా ఎప్పుడైతే దుర్గతి పూర్తవుతుందో అప్పుడే తండ్రి సద్గతిని ఇవ్వడానికి వస్తారు కదా.

తండ్రి అర్థం చేయించారు - ఎప్పుడూ, ఎవరితోనూ భక్తి చేయకండి అని చెప్పకండి. అలా కాదు. తండ్రి పరిచయాన్ని ఇచ్చి అర్థం చేయించాలి, అప్పుడు బాణం తగులుతుంది. మహాభారత యుద్ధము అని ఎందుకంటారు అనేది మీకు తెలుసు. ఎందుకంటే ఇది చాలా భారీ యజ్ఞము, ఈ యజ్ఞము నుండే ఈ యుద్ధము ప్రజ్వలితమయ్యింది. ఈ పాత ప్రపంచం అంతమవ్వనున్నది. ఈ విషయాలు మీ బుద్ధిలో ఉన్నాయి. మనుష్యులకు శాంతి బహుమతులు లభిస్తూ ఉంటాయి. కానీ శాంతి అనేదే ఉండదు. వాస్తవానికి శాంతిని స్థాపన చేసేవారైతే ఒక్క తండ్రియే. మీరు వారికి సహాయకులుగా ఉన్నారు. బహుమతి కూడా మీకే లభించనున్నది, తండ్రికేమైనా బహుమతి లభిస్తుందా. తండ్రి అయితే దాత. మీకు నంబరువారు పురుషార్థానుసారంగా బహుమతి లభిస్తుంది. లెక్కలేనంతమంది పిల్లలు ఉంటారు. మీరు ఇప్పుడు పవిత్రత, సుఖ, సమృద్ధులను స్థాపన చేస్తున్నారు. ఇది ఎంత గొప్ప బహుమతి! ఎవరు ఎంతగా శ్రమిస్తే అంతగా వారికి సూర్యవంశీ రాజధాని యొక్క బహుమతి లభిస్తుందని మీకు తెలుసు. తండ్రి శ్రీమతాన్ని ఇచ్చేవారు. బాబా, ఆశీర్వదించండి అని అనకూడదు. తండ్రిని స్మృతి చేసినట్లయితే మీ వికర్మలు వినాశనమవుతాయని విద్యార్థులకు సలహా ఇవ్వడం జరుగుతుంది. యోగబలం ద్వారానే మీ ఆత్మ పవిత్రముగా అవుతుంది. మీరందరూ సీతలు, మంటలను దాటి వెళ్తారు. యోగబలం ద్వారానైనా దాటవలసి ఉంటుంది లేక ఆ మంటలలోనైనా కాలిపోవలసి ఉంటుంది. దేహ సహితంగా సర్వ సంబంధాలను త్యజించి ఒక్క అతి ప్రియమైన తండ్రిని స్మృతి చేయాలి. కానీ ఈ స్మృతి నిరంతరం ఉండడమనేది చాలా కష్టము. సమయం పడుతుంది. యోగాగ్ని అని కూడా అంటూ ఉంటారు. భారత్ యొక్క ప్రాచీన యోగము మరియు జ్ఞానం ప్రసిద్ధమైనవి, ఎందుకంటే గీత సర్వ శాస్త్రమయి శిరోమణి. అందులో రాజయోగము అన్న పదము ఉంది, కానీ రాజ అన్న పదాన్ని మాయం చేసి కేవలం యోగము అన్న పదాన్ని పట్టుకున్నారు. ఈ రాజయోగము ద్వారా నేను మిమ్మల్ని రాజులకే రాజులుగా తయారుచేస్తానని తండ్రి తప్ప ఇంకెవ్వరూ చెప్పలేరు. ఇప్పుడు మీరు శివబాబా సమ్ముఖంలో కూర్చున్నారు. ఆత్మలమైన మనమందరము అక్కడ పరంధామంలో నివాసముండేవారమని, తర్వాత శరీరాన్ని ధరించి పాత్రను అభినయిస్తామని మీకు తెలుసు. పునర్జన్మలను శివబాబా అయితే తీసుకోరు. బ్రహ్మ, విష్ణు, శంకరులు కూడా పునర్జన్మలను తీసుకోరు. తండ్రి అంటారు, నేను పతితులను పావనంగా తయారుచేయడానికే వస్తాను, అందుకే అందరూ - పతిత-పావనా, రండి అని తలుచుకుంటారు, ఇది సరైన పదము. తండ్రి అంటారు, నేను మిమ్మల్ని పావనంగా, దేవీ-దేవతలుగా తయారుచేస్తున్నాను కావున అంతటి నషా కూడా ఎక్కాలి. బాబా వీరిలోకి వచ్చి మనకు శిక్షణను ఇస్తున్నారు. ఈ ఫలాల తోటకు యజమాని బాబా, మనం బాబా చేతిని పట్టుకున్నాము. ఇదంతా బుద్ధికి సంబంధించిన విషయము. బాబా మనల్ని ఆవలి తీరం వైపుకు, విషయ సాగరం నుండి క్షీర సాగరం వైపుకు తీసుకువెళ్తారు. అక్కడ విషము ఉండదు, అందుకే దానిని నిర్వికారీ ప్రపంచము అని అంటారు. భారత్ నిర్వికారిగా ఉండేది, ఇప్పుడు అది వికారీగా అయిపోయింది. ఈ చక్రము భారత్ గురించే ఉంది. భారతవాసులే చక్రము చుడతారు. ఇతర ధర్మాలవారు పూర్తి చక్రమంతా తిరగరు. వారు తర్వాత వస్తారు. ఇది చాలా అద్భుతమైన చక్రము. బుద్ధిలో నషా ఉండాలి. ఈ చిత్రాలపై చాలా అటెన్షన్ ఉండాలి. సేవ చేసి చూపించండి. విదేశాలలోకి కూడా ఈ చిత్రాలు వెళ్ళినట్లయితే పేరు

ప్రఖ్యాతమవుతుంది. విహంగ మార్గపు సేవ జరుగుతుంది. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. అవినాశీ జ్ఞాన రత్నాల ఖజానా ఏదైతే లభించిందో దానిని దానం చేయాలి. తమ సమయాన్ని తినడంలో-తాగడంలో, పరచింతనలో వృధాగా పోగొట్టుకోకూడదు.

2. గవ్వతుల్యమైన మనుష్యులను వజ్రతుల్యంగా తయారుచేసే సేవను చేయాలి. తండ్రి నుండి ఆశీర్వాదాన్ని లేక కృపను అడగకూడదు. వారి సలహాపై నడుస్తూ ఉండాలి.

వరదానము:- సేవ ద్వారా ప్రాప్తించిన కీర్తి-ప్రతిష్ఠలను, పదవిని త్యాగము చేసి అవినాశీ భాగ్యాన్ని తయారుచేసుకునే మహాత్యాగీ భవ

పిల్లలైన మీరు ఏ శ్రేష్ఠ కర్మలనైతే చేస్తారో, ఆ శ్రేష్ఠ కర్మలకు లేక సేవకు ప్రత్యక్ష ఫలము - సర్వుల ద్వారా మహిమ జరగటము. సేవాధారులకు శ్రేష్ఠ గాయనము అనే సీటు లభిస్తుంది. కీర్తి-ప్రతిష్ఠలు, పదవి అనే సీటు లభిస్తుంది, ఈ సిద్ధి తప్పకుండా ప్రాప్తిస్తుంది. కానీ ఈ సిద్ధులు గమ్యము వైపుకు మెట్లు వంటివి, ఇవి అంతిమ గమ్యమేమీ కాదు, అందుకే వీటిని త్యాగము చేసేవారిగా, భాగ్యవంతులుగా అవ్వండి, దీనినే మహాత్యాగులుగా అవ్వటము అని అంటారు. త్యాగాన్ని కూడా త్యాగము చెయ్యటమే గుప్త మహాదానుల విశేషత.

స్లోగన్:- ఫరిశ్తాగా అవ్వాలంటే సాక్షీగా అయ్యి ప్రతి ఆత్మ పాత్రను చూడండి మరియు సకాష్ ను ఇవ్వండి.